# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 11-11-2024** **సమయం : 1.20 గంటలు**

---

# ముఖ్యాంశాలు

1. **2024-25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి రాష్ట్ర పూర్తి స్థాయి బడ్జెట్‌ను ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ శాసన సభలో ప్రవేశపెట్టారు.**
2. **రాష్ట్ర శాసన సభలో ఈరోజు వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు వ్యవసాయ బడ్జెట్‌ను ప్రవేశపెట్టారు.**
3. **ఆంధ్రప్రదేశ్‌ను మాదక ద్రవ్య రహిత రాష్ట్రంగా మార్చేందుకు చర్యలు తీసుకుంటన్నామని రాష్ట్ర డిజిపి ద్వారకా తిరుమలరావు తెలిపారు.**
4 **భారతదేశ 51వ ప్రధాన న్యాయమూర్తిగా జస్టిస్ సంజీవ్ ఖన్నా ఈరోజు ప్రమాణ స్వీకారం చేశారు.**
5. **ఈ రోజు జాతీయ విద్యా దినోత్సవం నిర్వహిస్తున్నారు.**

==========================

రాష్ట్ర శాసన సభ బడ్జెట్ సమావేశాలు ఈ ఉదయం ప్రారంభమయ్యాయి. సమావేశాలు ప్రారంభమైన వెంటనే ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ 2024 - 25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి పూర్తి స్థాయి బడ్జెట్‌ను శాసన సభలో ప్రవేశపెట్టారు. 2 లక్షల 94 వేల 427. 25 కోట్ల రూపాయలతో కూడిన వార్షిక బడ్జెట్‌ను ఆయన సభ ముందు ఉంచారు. అభివృద్ధి సంక్షేమం సమతూకంగా ఉండేలా బడ్జెట్‌ను రూపొందించామని బడ్జెట్ ను ప్రవేశ పెడుతూ పయ్యావుల కేశవ్ పేర్కొన్నారు. బడ్జెట్‌లో రెవిన్యూ వ్యయం అంచనా 2 లక్షల 35 వేల 916. 99 కోట్ల రూపాయలు .... మూల ధన వ్యయం అంచనా 32 వేల 712.84 కోట్ల రూపాయలుగా ఉంటుందని తెలిపారు. కాగా ... రెవిన్యూ లోటు 34 వేల 743. 38 కోట్ల రూపాయలు ... ద్రవ్య లోటు 68 వేల 742. 65 కోట్ల రూపాయలని మంత్రి వెల్లడించారు. బడ్జెట్‌లో వివిధ రంగాలకు చేసిన కేటాయింపులను పయ్యావుల కేశవ్ వివరిస్తూ ..

..వాయిస్... 35 సెకన్లు

---

మరోవైపు వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు శాసన సభలో ఈ రోజు 2024- 25 సంవత్సర వ్యవసాయ బడ్జెట్‌ను ప్రవేశపెట్టారు. మొత్తం బడ్జెట్ వ్యయం 43 వేల 402 కోట్ల రూపాయలుగా పేర్కొన్నారు. రైతులకు విత్తనాలు ..., సూక్ష్మ పోషక ఎరువులు రాయితీపై అందించడానికి ప్రధమ ప్రాధాన్యం

ఇస్తామని వ్యవసాయ బడ్జెట్‌ను ప్రవేశ పెడుతూ అచ్చెన్నాయుడు తెలిపారు. భూసార పరీక్షలకు తిరిగి ప్రాధాన్యం ఇస్తున్నామని ..., ప్రాథమిక పరపతి సంఘాల ద్వారా ఎరువులు పంపిణీ చేస్తామని చెప్పారు. రాయితీ విత్తనాలకు 240 కోట్ల రూపాయలు ...., భూసార పరీక్షలకు 38.88 కోట్ల రూపాయలు కేటాయించామని తెలిపారు. రాష్ట్రానికి వ్యవసాయం వెన్నెముక వంటిదని ... 62 శాతం మంది జనాభా వ్యవసాయ అనుబంధ రంగాలపై ఆధార పడి జీవిస్తున్నారని అచ్చెన్నాయుడు పేర్కొంటూ

...వాయిస్.. 38 సెకన్లు

---------------------------

భారత దేశ తొలి విద్యా శాఖ మంత్రి .... స్వాతంత్ర్య సమర యోధులు...., భారత రత్న మౌలానా అబుల్ కలామ్ ఆజాద్ 137వ జయంతి సందర్భంగా దేశానికి ఆ మహనీయుడు అందించిన సేవలను ప్రజలు స్మరించుకుని ఈరోజు నివాళులు అర్పిస్తున్నారు.

ఇదిలా ఉండగా ... శాసనసభలో ముఖ్య మంత్రి ఛాంబర్‌లో జరిగిన ఒక కార్యక్రమంలో మౌలానా అబుల్ కలామ్ ఆజాద్ చిత్రపటానికి శాసన సభాపతి చింతకాయల అయ్యన్నపాత్రుడు ...., ముఖ్య మంత్రి నారా చంద్రబాబు నాయుడు ..., ఉప ముఖ్యమంత్రి కె. పవన్ కళ్యాణ్ ..., మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్.ఎం.డి. ఫరూఖ్ తదితరులు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.

---------------------------

ఆంధ్రప్రదేశ్‌ను మాదక ద్రవ్య రహిత రాష్ట్రంగా మార్చేందుకు చర్యలు తీసుకుంటున్నామని రాష్ట్ర డిజిపి ద్వారకా తిరుమలరావు తెలిపారు. తిరుపతిలోని శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయంలో మాదకద్రవ్యాల వాడకం వల్ల కలిగే నష్టాలు, సైబర్ నేరాలపై తిరుపతి జిల్లా పోలీసు యంత్రాంగం ఆధ్వర్యంలో విద్యార్థులకు ఒకరోజు అవగాహన సదస్సును ఈరోజు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో దృశ్యమాధ్యమ విధానం ద్వారా విద్యార్థులతో మాట్లాడుతూ మాదక ద్రవ్యాలపై రాష్ట్ర వ్యాప్తంగా అవగాహనా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు ఆయన చెప్పారు. సైబర్ నేరాలపై కూడా ప్రజలను అప్రమత్తం చేస్తున్నామన్నారు.

---------------------------

భారతదేశ 51వ ప్రధాన న్యాయమూర్తిగా జస్టిస్ సంజీవ్ ఖన్నా ఈరోజు ప్రమాణం చేశారు. రాష్ట్రపతి భవన్‌లో జరిగిన కార్యక్రమంలో రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము ప్రమాణస్వీకారం చేయించారు. ఈ కార్యక్రమానికి ఉప రాష్ట్రపతి జగదీప్ ధన్‌ఖడ్, ప్రధానమంత్రి నరేంద్రమోదీ, కేంద్ర న్యాయశాఖ మంత్రి అర్జున్ రామ్ మేఘ్వాల్ సహా ఇతర కేంద్ర మంత్రులు హాజరయ్యారు. ప్రధాన న్యాయమూర్తిగా జస్టిస్ డి.వై.చంద్రచూడ్ పదవీకాలం నిన్నటితో ముగియడంతో ఆయన స్థానంలో జస్టిస్ సంజీవ్ ఖన్నా బాధ్యతలు స్వీకరించారు. 2025 మే 13 వరకు ఈయన ఈ పదవిలో కొనసాగుతారు.

---------------------------

ఉద్యానశాఖ, గ్రామీణ పేదరిక నిర్మూలన సొసైటీ –సెర్ప్ సంయుక్తంగా రాష్ట్రంలో కూరగాయలు, పూల సాగును ప్రోత్సహించేందుకు 50 శాతం రాయితీతో షేడ్‌నెట్స్ ఇవ్వనున్నారు. దీనికి గాను 4 జిల్లాల్లో 300 మంది రైతులను ఎంపిక చేసినట్లు అధికారులు తెలిపారు. 400 నుంచి 500 చదరపు మీటర్ల విస్తీర్ణంలో సాగుకు అయ్యే ఖర్చులో దాదాపు లక్ష రూపాయలు రాయితీ లభిస్తుండగా మిగతా మొత్తాన్ని సెర్ప్ ద్వారా రుణంగా

అందించనున్నామనీ, ఎస్సీ, ఎస్టీ రైతులకు ఉన్నతి పథకం కింద వడ్డీ లేని రుణంగా ఇతర వర్గాల వారికి స్త్రీనిధి ద్వారా బ్యాంకుల కంటే తక్కువ వడ్డీకి ఇస్తామని అధికారులు తెలిపారు.

---------------------------

రాష్ట్రంలోని గ్రామ అభివృద్ధికి కృషి చేసే మహిళా సర్పంచులకు మరింత తోడ్పాటు అందించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఉమెన్ ఫ్రెండ్లీ పంచాయతీ–మహిళా స్నేహపూర్వక పంచాయతీల పేరుతో ప్రత్యేక కార్యక్రమాన్ని అమలు చేయనున్నాయి. అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల అమలులో ఆదర్శంగా ఉండేలా వాటిని తీర్చిదిద్దాలన్నది ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశం. ఇందుకోసం రాష్ట్రంలో జిల్లాకు ఒకటి చొప్పున 26 పంచాయతీలను ప్రభుత్వం ఎంపికచేసింది.

---------------------------

ప్రజలకు విద్య ప్రాముఖ్యతను తెలియజేసే ఉద్దేశ్యంతో ఈరోజు జాతీయ విద్యా దినోత్సవం నిర్వహిస్తున్నారు. దేశంలో విద్యారంగాభివృద్ధికి విశేష కృషి చేసిన ప్రముఖ విద్యావేత్త మౌలానా అబుల్ కలామ్ ఆజాద్ జయంతిని జాతీయ విద్యా దినోత్సవంగా నిర్వహిస్తున్నారు. 1888వ సంవత్సరం నవంబర్ 11వ తేదీన జన్మించిన ఆయన అసలు పేరు మొహియుద్దీన్ అహ్మద్ కాగా... అబుల్ కలాం ఆయనకు లభించిన బిరుదు. ఆజాద్ .... ఆయన కలం పేరు. స్వాతంత్ర్య సంగ్రామంలో కూడా మౌలానా కీలక పాత్ర పోషించారు. స్వాతంత్ర్య అనంతరం ఏర్పడిన భారత ప్రభుత్వంలో ఆయన విద్యా శాఖ మంత్రిగా వ్యవహరించి విద్యా సంస్కరణలకు విశేష కృషి చేశారు. యుజీసీ, ఐసీసీఆర్, ఎఐసిటియు, సీఐఎస్ఆర్.... వంటి ప్రతిష్టాత్మక సంస్థలతో పాటు ఖరగ్ పూర్ నగరంలో సాంకేతిక విద్యా సంస్థను ఏర్పాటు చేశారు. విద్యా దినోత్సవం సందర్భంగా చదువు విలువ గురించి అవగాహన కల్పించడానికి ఈరోజు కేంద్ర ..., రాష్ట్రాల విద్యా శాఖల ఆధ్వర్యంలో పలు కార్యక్రమాలు జరుగుతున్నాయి.

---------------------------

రాష్ట్రంలోని ప్రస్తుత వాతావరణ పరిస్థితులను అమరావతిలోని భారత వాతావరణ కేంద్రం అధికారి వి.ఎస్.ఎం.రాజు కొద్దిసేపటి క్రితం ఆకాశవాణి విజయవాడ కేంద్ర ప్రాంతీయ వార్తావిభాగానికి తెలియజేస్తూ......

.....వాయిస్.... 30 సెకన్లు....

=====================